

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



తాజాగా విడుదలైన ఓటర్ల తుది జాబితాలో అక్రమాలు, అవకతవకలు యథాతథంగా కొనసాగుతూనే వున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లా? అధికారుల నిర్లక్ష్యమా? అధికార పార్టీ సేవలో తరిస్తున్న అధికారుల అనైతిక వైఖరా? కారణం ఏదన్నా.. తుది ఓటర్ల జాబితాలో కూడా తప్పుల తడకగానే విడుదల అయింది. ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన ఫిర్యాదుల్లో ఒకటి అరా ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వాటిని మాత్రమే సరిచేసిన అధికారులు మిగిలినవాటిని అలానే వదిలేశారు. గుంటూరు నగరంలో కొత్త, పాత డోర్ నెంబర్లతో విడుదలైన ఓట్ల జాబితాలో నెలకొన్న గందరగోళం తుది జాబితాలో కూడా యథాతథంగా కొనసాగింది. కొత్త డోర్ నెంబర్లతో జాబితాను రూపొందించి, అక్రమాలను అరికట్టాలన్న ప్రతిపక్ష పార్టీల వేడుకోళ్లను పక్కనపెట్టి పాత, కొత్త డోర్ నెంబర్లతోనే తుది జాబితాను విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు.



ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న డబుల్ ఎంట్రీలు



ఓటర్ల జాబితాలో ప్రత్యక్షమైన మృతుల ఓట్లు

ఆ ఓట్లకు.. మళ్లీ చోటు!

- ఓటర్ల తుది జాబితాలో తప్పులు యథాతథం
- మళ్లీ ప్రత్యక్షమైన డబుల్ ఎంట్రీలు
- ఆందోళన కలిగిస్తున్న మృతుల ఓట్లు
- పాత, కొత్త డోర్ నెంబర్లతో గందరగోళంగా జాబితా
- సరిచేయకుండా చేతులు దులుపుకున్న అధికారులు
- గుంటూరు ఓటర్ల తనిఖీలో వలంటీర్ల హడావుడి

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ నెంబరు పరిధిలో షేక్ గౌసియా బేగం పేరుతో, సయ్యద్ నబీ పేరుతో రెండేసి ఓట్లు వున్నాయి. ఇలా ఒకే పేరుతో వున్న రెండేసి ఓట్లపై గతంలోనే టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. కానీ అధికారులు మాత్రం వాటిని పట్టించుకోలేదు. దీంతో అవి తుది జాబితాలో తిరిగి ప్రత్యక్షమయ్యాయి. కొబాల్ట్‌పేటకు చెందిన దాసరి జయమ్మ కొన్నాళ్ల క్రితం చనిపోయింది. ఆమె ఓటు ముసాయిదా జాబితాలో వచ్చింది. దానిపై నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కానీ తుది జాబితాలో ఆ పేరు యథాతథంగా వచ్చింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్కో నియోజకవర్గంలో చనిపోయినవారి పేరుతో కొనసాగుతున్న ఓట్లు వేలల్లో వున్నాయి.

గుంటూరు 'పశ్చిమ' టార్గెట్..

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా వున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అధికారపార్టీ టార్గెట్ చేసింది. ఆ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఏడాది కాలంగా చేయని అక్రమాలు లేవు. ఒకే డోరు నెంబరుతో వందల ఓట్లను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అనుకూలుర ఓట్లు పెద్దసంఖ్యలో చేర్పించారని, ఒకరి పేరుతోనే రెండూ అంతకంటే ఎక్కువ ఓట్లు వున్నాయని, మృతుల ఓట్లు భారీసంఖ్యలో ఉన్నాయని ఫిర్యాదులు అందాయి. దీనికి తోడు పాత, కొత్త డోర్ నెంబర్లతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా వుందని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. కానీ అధికారులు ఒకటి రెండు ముఖ్యమైన ఫిర్యాదులను పరిష్కరించి వదిలేశారు. ఇప్పటికీ ఆ నియోజకవర్గం పరిదిలో డబుల్ ఓట్లు, మృతుల ఓట్లు లెక్కకు మించి వున్నాయి. ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో 10 నుంచి 15 వరకూ మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీలు వున్నట్లు వెలుగులోకి వస్తోంది. మొత్తంగా నియోజకవర్గం పరిధిలో 282 బూతుల్లో దాదాపు 5 వేల వరకూ మృతుల, డబుల్ ఎంట్రీ ఓట్లు వుంటాయని ప్రతిపక్ష పార్టీలు అంచనా వేస్తున్నాయి. వాటిపై కసరత్తు చేస్తున్నాయి.

మృతుల ఓట్ల తొలగింపు సవాలు...


గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మృతుల ఓట్ల తొలగింపు సవాలుగా మారింది. మృతుల ఓట్లను తొలగించాలని నియోజకవర్గ అధికారులకు ఫిర్యాదు చేసిన పలువురు నేతలు చివరకు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. అయినప్పటికీ ఇటీవల విడుదలైన తుది జాబితాలో మృతుల ఓట్లు దర్శనమిచ్చాయి. తాజా లెక్కల ప్రకారం 3 వేల వరకూ మృతుల ఓట్లు ఉన్నట్లు అంచనాకి వచ్చారు. మొత్తంగా జిల్లాలో 10వేలకు పైగా మృతుల ఓట్లు వున్నాయని, అవి యథాతథంగా తుదిజాబితాలో కూడా కనిపిస్తున్నాయని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఓట్లతో అధికారపార్టీ దొంగ ఓట్ల కుట్రలను కొనసాగిస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వలంటీర్ల హడావుడి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వలంటీర్ల హడావుడి కనిపిస్తోంది. ఓటర్ల జాబితా, ఎన్నికల అంశాల్లో వలంటీర్ల జోక్యం ఉండరాదని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆదేశించినా ప్రభుత్వం, అధికారపార్టీ వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వలంటీర్లను ఇంటింటికీ తిప్పి ఓటరు వెరిఫికేషన్, ఓటు నమోదు, తదితర పనులకు వారినే వినియోగిస్తున్న ఘటనలు అనేకం కనిపిస్తున్నాయి.

షెల్టర్ లెస్ చిరునామాతోనూ ఓటర్లు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెల్టర్ లెస్(నివాస రహిత) డోర్ నెంబరుతోనూ ఓటర్ల చేర్పులు జరిగాయి. ఇవి ఎస్ఎస్ఆర్ - 2024లో భాగంగా జరిగాయా... గత కొన్నేళ్ల క్రితమే నమోదయ్యాయా అన్న దానిపై స్పష్టత లేదు. బీఎల్‌వోలు కేవలం డోర్ టూ డోర్ పరిశీలన మాత్రమే జరిపి ఎవరికైనా ఓటుహక్కు లేకపోతే వారితో ఫారం-6 పెట్టించారు. అంతే తప్పా నివాసం లేకుండా ఉన్న వారి జోలికి అసలు పోలేదు. అయినప్పటికీ పలు పోలింగ్ బూత్‌లలో ఓటర్ల ఇంటి నెంబరు వద్ద షెల్టర్ లెస్ అని పొందుపరిచారు. వీటిపై ప్రతిపక్ష పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.



షెల్టర్ లెస్ డోర్ నెంబరుతో ఓటరు

షెల్టర్‌లెస్ వారికి కూడా ఓటుహక్కు కల్పించే నిబంధన ఉన్నది. అయితే ఎక్కడైతే వారికి ఓటుహక్కు కల్పించారో ఆ పరిసరాల్లో సంబంధిత ఓటర్లు ఉంటున్నారా, లేదా అనేది బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉన్నది. నివాసరహిత ఓటర్లు పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. అలాంటప్పుడు స్థానికంగా ఉండకపోతే వారి ఓటుని ఫారం-7 పెట్టి తొలగించాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు ఈ దఫా ఎస్ఎస్ఆర్‌లో చేపట్టలేదు. ఇప్పుడు తుది ఓటర్ల జాబితాని విడుదల చేసిన తర్వాత కొంతమంది ఓటర్ల ఇంటి నెంబర్ల వద్ద షెల్టర్ లెస్ అని పేర్కొన్నారు. దీని వలన ఆయా ఓటరు ఎక్కడున్నారనే దానిని తెలుసుకోవడం కూడా కష్టమే.

కాగా 18 ఏళ్ల వయస్సు దాటి గతంలో ఓటు హక్కు పొందలేక గత ఎస్ఎస్ఆర్‌లో దరఖాస్తు చేసుకొన్న వారికి ఈఆర్‌వోలు ఓటుహక్కు కల్పించలేదు. అదేమంటే ఇప్పటివరకు ఎందుకు ఓటరుగా నమోదు కాలేదో తమకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని, దానినే తాము ఈసీకి పంపుతామన్నారు. అలా అండర్‌టేకింగ్ ఇచ్చిన వారికి కూడా ఓటుహక్కుని ఈఆర్‌వోలు జిల్లాలో పలుచోట్ల కల్పించలేదు.

ఓటు.. డిలీట్!

- ఎన్నో ఏళ్లుగా ఉన్న ఓటు తొలగింపు
- ఒకే కుటుంబంలో ఓట్లన్నీ తీసేసి...
- గ్రామంలో నివాసం ఉన్నా ఓటు లేనట్టేనట
- ముగ్గురున్న కుటుంబంలోకి మరో కొత్త ఓటు
- ఎవరిదోకూడా తెలియని విచిత్రం


తెనాలి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): బతికున్నవారి ఓట్లు మరణించినట్టు, చనిపోయినవారి ఓట్లు ఉన్నట్లు అనేక చిత్రాలకు చిట్టాగా మారిన మన ఓటర్ల జాబితాలో మరికొన్ని వి'సి'త్రాలు' కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఓటున్న కుటుంబాలకు కుటుంబాల ఓట్లు ఏ కారణం లేకుండానే డిలీట్ కొట్టేయటం ఒక విచిత్రమైతే, అసలు ఎవరో తెలియని ఓట్లు కొన్ని కుటుంబాల జాబితాలో కలిపేయటం మరో గందరగోళానికి తెరతీస్తోంది.

తెనాలి నియోజకవర్గంలో పెదరావూరు గ్రామంలో నివాసముంటున్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతులు, వారి పిల్లల ఓట్లు కొత్త జాబితాలో కనిపిస్తున్నా, వాటిపై డిలీట్ అని కొట్టి ఉన్నాయి. ఇదే తరహాలో ఇదే గ్రామంలో మరికొన్ని కుటుంబాల ఓట్లుకూడా డిలీట్ చేయటం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకే ఓటు ఉండటం, వారుకూడా అదే గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా వారి ఓటు తొలగింపు కింద డిలీట్ చేయటంపై గందరగోళం నెలకొంది. తెనాలి నియోజకవర్గంలోని పెదరావూరు, సంగంజాగర్లమూడి, అంగలకుదురు, కొలకలూరు, నందివెలుగు, తెనాలి పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఓటర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఒక్కో గ్రామంలో కనీసం ఒకటి, రెండు కుటుంబాల ఓట్లు డిలీట్ జాబితాలోకి వెళ్లటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కొన్నయితే గత సవరణ జాబితా ఓటర్ల లిస్ట్‌లోకూడా సక్రమంగా ఉంటే, ఈసారి జాబితాలో డిలీట్ అని రావటం వంటి విచిత్రాలు కూడా ఉన్నాయని ఓటర్లు చెబుతున్నారు.

తెనాలి పట్టణంలోని 23వ వార్డులో నాగూర్ నివాసం ఉంటున్న ఇంటి నంబర్ కింద వారి కుటుంబంలోని ముగ్గురు ఓట్లే ఉంటున్నాయి. అయితే ఈసారి వారి ఇంటిలో నివాసం ఉంటున్నట్టు అదే ఇంటి నంబర్‌తో రమేష్ దాస్ అనే ఓటు కొత్తగా వచ్చి చేరింది. అయితే గత మూడు సవరణలకు ముందే నాగూర్ దానిని గుర్తించి బీఎల్‌ఓలకు, రెవెన్యూ అధికారులకు వివరించినా, పలుసార్లు రాతపూర్వకంగా అందించినా ఈసారీ ఆ పేరును తొలగించలేదు. ఒకవేళ దానిని తొలగించకపోతే, రేపటి పోలింగ్ రోజున అదే ఓటు దొంగ ఓటు కింద పడే ప్రమాదం ఉందనే అనుమానాన్ని అతను వ్యక్తం చేస్తున్నారు.



తెనాలి నియోజకవర్గం పెదరావూరులో ఒకే కుటుంబంలోని ఐదు ఓట్లు డిలీట్ చేసిన చిత్రం



గ్రామంలోనే నివాసం ఉన్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతుల ఓట్లు డిలీట్ చేసిన చిత్రం



బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహనరెడ్డికి మిచౌంగ్ తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని ఫొటోల ద్వారా వివరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా(ఫైల్ ఫొటో)

జగనన్న హామీ.. హుళక్కే!

- అన్నదాతలకు ఇంకా అందని మిచౌంగ్ తుఫాన్ పరిహారం
- సంక్రాంతిలోపే ఇస్తామన్న సీఎం మాటలు నీటిమూటలే
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతుల ఎదురుచూపులు
- పంట నష్టం నివేదికల్లోనూ భారీగా కోత

బాపట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాన్ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల్ని అతలాకుతలం చేసి ఇప్పటికే నెలలు గడచిపోయింది. గతేడాది డిసెంబరు మొదటి వారంలో విరుచుకుపడిన తుఫాన్ ధాటికి అన్నదాతలు చిగురుటాకులా వణికిపోయారు. విపత్తు సృష్టించిన నష్టానికి ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా తోడవడంతో నష్టం తీవ్రత భారీగా పెరగడంతో అన్నదాత గుండె చెరువైంది. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించడానికి గతేడాది డిసెంబరు 8న సీఎం జగన్మోహనరెడ్డి జిల్లా పరిధిలోని కర్లపాలెం మండలం బుద్ధాం, పాతనందాయపాలేనికి వచ్చారు. అక్కడ దెబ్బతిన్న వరిపైరును పరిశీలించడంతో పాటు రైతులనుద్దేశించి మాట్లాడారు. సంక్రాంతి పండగలోపే నష్టపోయిన అన్నదాతలందరికీ పరిహారం జమచేస్తామని గొప్పగా ప్రకటించారు. పండగ వచ్చి పోయింది.. కానీ రైతాంగం ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ అవ్వలేదు.

నివేదికలతో సరి...

మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలతో నివేదికను గతేడాది డిసెంబరు చివరికి వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఉద్యాన పంటలతో కలిపి జిల్లావ్యాప్తంగా మొత్తం 63,301 హెక్టార్లలో పంటకు మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టం వాటిల్లిందని, 92,220 మంది రైతులకు పరిహారం అందించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ జాబితా ప్రభుత్వానికి పంపించి కూడా రెండు వారాలు దాటింది. పైగా అన్నదాతలకు సంక్రాంతిలోపే డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని కూడా చెప్పారు.

నష్టం నివేదికల్లోనూ భారీగా కోత..

మిచౌంగ్ తుఫాన్ విరుచుకుపడినప్పుడు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికల ప్రకారం బాపట్ల జిల్లాలో 93,244 హెక్టార్లకు నష్టం వాటిల్లినట్టు తేల్చారు. ఇదే పల్నాడు జిల్లాకు వచ్చేసరికి ఇది 9,370 ఎకరాలుగా తేల్చారు. ఇక గుంటూరు జిల్లాకు 1,04,790 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అప్పట్లో ప్రాథమికంగా వ్యవసాయశాఖ నిర్ధారణకు వచ్చింది. నష్టం వివరాలను సోషల్ ఆడిట్ కోసం ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉంచినప్పుడు బాపట్ల జిల్లాలో సంఖ్య 78,173 హెక్టార్లకు తగ్గిపోగా చివరికి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో అది కాస్తా 63,301 హెక్టార్లకే పరిమితమైంది. ఇక పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా తుది జాబితాలో 50 శాతం విస్తీర్ణానికే చోటు దక్కింది.

ఉదారంగా ఆదుకుంటాం..

సీఎం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా ఆదుకుంటామనే మాటలు చెప్పారు. నష్టం నివేదికల్లో ఎక్కడా ఉదారత కనబడకపోగా అడ్డగోలుగా దెబ్బతిన్న విస్తీర్ణం తగ్గించడానికే ప్రయత్నించారు. ప్రాథమిక నివేదికలకు, తుది జాబితాకు పొంతన లేకపోవడమే దీనికి నిదర్శనం. పైగా సోషల్ ఆడిట్ పేరుతో తొలుత రూపొందించిన పంటనష్టం జాబితా వివరాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు. విచిత్రంగా తుది నివేదికలో సోషల్ ఆడిట్‌లో ఉంచిన జాబితా కూడా తగ్గిపోయింది.

ఇచ్చే కాస్తా ఎప్పుడిస్తారు..

దాదాపు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్ల నష్టాన్ని అన్నదాతలకు మిగిల్చిందని అప్పట్లో అంచనా వేశారు. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ నష్టం రూ.400 కోట్ల వరకు ఉంటుందని లెక్కకట్టారు. తీరా తుది జాబితాకు వచ్చేసరికి ఒక్క బాపట్ల జిల్లాలో రూ.101.40 కోట్ల నష్టమే జరిగినట్టు ప్రభుత్వానికి నివేదించడంతో అవాక్కవడం రైతాంగం వంతైంది. ఇచ్చే ఆ కాస్తా సాయంపై కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేయడాన్ని అన్నదాతలు తప్పుబడుతున్నారు. సంక్రాంతికి పరిహారం అందిస్తామని జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలకే ఇప్పటివరకు మోక్షం కలగలేదని రైతులు వాపోతున్నారు.

పరిహారం అందించడంలో కూడా రాజకీయమా..

వాస్తవానికి సంక్రాంతికి పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా ఉండడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సమీప దూరంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఫిబ్రవరి చివరి వరకు కాలయాపన చేసి అప్పుడు అన్నదాతల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తే రాజకీయంగా తమకు ఉపయోగం ఉంటుందనే ఆలోచనలో పాలకపార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. దీనిని బలపర్చే విధంగానే పరిహారం విషయంలో వ్యవసాయశాఖ సమాధానం ఉంటోంది. నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడంతో తమ పని అయిపోయిందని పరిహారం అందించే విషయంలో ప్రస్తుతానికి కదలికలేమి కనబడడం లేదని యంత్రాంగం సమాధానమివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

టీడీపీలోకి.. రాయలు రాక

- నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి ఎంపీ లావు
- త్వరలో తెలుగుదేశంలో చేరనున్న శ్రీకృష్ణదేవరాయలు
- లావుతో పాటు పలువురు వైసీపీ నేతలు టీడీపీలోకి...



నరసరావుపేట, ఫిబ్రవరి 1: నరసరావుపేట పార్లమెంట్ నుంచి సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మరోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. అయితే ఈ సారి తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన పోటీ చేయనున్నారు. టీడీపీ అభ్యర్థిగా లావు పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఇటీవలే ఆయన వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. 6వ తేదీ తర్వాత పార్టీలో చేరతారని ఆయన ముఖ్య అనుచరులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లావుతో పాటు వైసీపీలోని కొందరు ముఖ్య నేతలు టీడీపీలో చేరతారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, పలువురు ముఖ్య నేతలు చేరనున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా లావుతో కలసి టీడీపీలో చేరతారని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నారా లోకేశ్‌ను మక్కెన కలసినట్టు సమాచారం.

నరసరావుపేట పార్లమెంట్‌కు గత ఎన్నికల్లో లావు శ్రీకృష్ణ దేవరాయలు వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి రాయపాటి సాంబశివరావుపై 1,53,978 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలుపొందారు. అదే నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ టిక్కెట్‌ను లావు ఆశించారు. అయితే ఆ పార్టీ అధిష్టానం ఆయనకు టిక్కెట్ నిరాకరించింది. గుంటూరు పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని ప్రతిపాదించింది. నరసరావుపేట నుంచి పోటీ చేస్తానని గుంటూరుకు వెళ్లనని లావు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ పార్టీని వీడారు. ఇదిలా ఉంటే నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్న టీడీపీ అభ్యర్థులతో లావు టచ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. మరో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ అధికారికంగా అధిష్టానం వారి పేర్లు ప్రకటించలేదు.

నరసరావుపేట నియోజకవర్గంలో కొన్ని కీలక కేంద్ర పథకాలను మంజూరుచేయించడంతో లావు శ్రీకృష్ణదేవరాయలు విశేష కృషి చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు సంబంధించి వన్య ప్రాణి సంరక్షణ, అటవీశాఖల అనుమతులు రావడం వెనుక ఆయన కృషి ఉంది. రైతుల ప్రయోజనాల కోసం ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు సాధించారు. నకరికల్లు మండలం నర్శింగపాడు వద్ద ఇటీవల శంకుస్థాపన చేశారు. జిల్లాలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆయన కృషి చేశారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయించారు. నియోజకవర్గ అభివృద్ధిపై లావు ప్రత్యేక దృష్టిసారించారు.

జిల్లాలో భారీగా.. డీఎస్పీల బదిలీ

- అత్యధిక మందికి స్థానచలనం
- దాదాపు అందరూ కొత్త ముఖాలే



గుంటూరు, ఫిబ్రవరి 1: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కొద్దిరోజులుగా జరుగుతున్న పోలీస్ అధికారుల బదిలీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఎస్పీలు, అదనపు ఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా డీఎస్పీలను బదిలీ చేసింది. జిల్లాలో అత్యధిక మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలతో పాటు స్థానిక వైసీపీ అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల సిఫార్సుల ఆధారంగా పెద్దఎత్తున పోలీసుల బదిలీలు జరిగాయి.

బదిలీ అయిన డీఎస్పీల వివరాలు...

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో విధులు నిర్వహిస్తున్న జీసీ గురునాథ్ బాబును సత్తెనపల్లి డీఎస్పీగా, డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సి.విజయభాస్కరరావును నెల్లూరు, డీఎస్ఆర్‌పీకు బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసరావుపేటకు, కమిషనరేట్‌లోని నార్త్ డివిజన్లో పనిచేస్తున్న సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా, కమిషనరేట్‌లో దిశ డీఎస్పీగా పని చేస్తున్న వీవీ నాయుడును గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు. కమిషనరేట్‌లో సీటీఎఫ్ డీఎస్పీగా పనిచేస్తున్న బీవీ సుబ్బారావును దిశ డీఎస్పీగా, మైలవరంలో పనిచేస్తున్న ఎం.రమేష్‌ను గుంటూరు సీసీఎస్‌కు, గుంటూరు నార్త్ డీఎస్పీగా పనిచేస్తున్న జవంగుల రాంబాబును మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ చేశారు. తుళ్లూరు డీఎస్పీ వి.పోతురాజును గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌కు నియమించారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డిని శ్రీకాళహస్తికి, సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను తూర్పుగోదావరి, దిశ డిఎస్పీగా నియమించారు. అలాగే గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ మందుల బాలసుందరరావును మార్కాపురం, గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాష్ బాబును ఎన్టీఆర్ కమిషనరేట్ దిశా డీఎస్పీగా నియమించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పి తుపాకుల వెంకటరత్నస్వామిని ప్రకాశం జిల్లా దిశా డీఎస్పీగా, నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్‌ను వెస్ట్ డీఎస్పీగా, ప్రకాశం దిశా డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల క్రైమ్ డీఎస్పీగా, బాపట్ల దిశా డీఎస్పీ కె.నాగేశ్వరరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఇంటిలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును తుళ్లూరు డీఎస్పీగా నియమించారు.

7లో..

చంపినా సరే వైసీపీలో కొనసాగం

- ఎమ్మెల్యే నుంచి బెదిరింపు కాల్స్
- గురజాల వైసీపీ కౌన్సిలర్ అనిత

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

చిరంజీవి నో.. వెంకటేశ్ ఎస్ ?




ఇండస్ట్రీలో ఒక హీరో నో చెప్పిన చిత్రాలకు మరో హీరో ఎస్ చెప్పడం పరిపాటే. తాజాగా టాలీవుడ్‌లోనూ అలాంటి సంఘటనే చోటు చేసుకుందని ఇండస్ట్రీ టాక్. దిల్ రాజు నిర్మాతగా దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవి కోసం ఓ కథను సిద్ధం చేశారనే మాట కొన్నాళ్లుగా పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రాజెక్ట్ కూడా దాదాపు ఓకే అయినట్లేనని భావించారు. కానీ ఆ కథ చిరంజీవిని మెప్పించలేకపోయిందనే మాట ప్రస్తుతం వినిపిస్తోంది. దాంతో వెంకటేశ్ దగ్గరకు వెళ్లిన అనిల్ రావిపూడి అదే కథను ఓకే చేయించుకున్నారనీ, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే ఇంతకీ ఆ కథలో చిరంజీవికి ఏం నచ్చలేదు, వెంకటేశ్‌కు ఏం నచ్చి ఓకే చేశారు అనేది ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ముందుకు వచ్చేవరకూ మిస్టరీగానే మిగిలిపోతుంది.

కొత్త ప్రపంచంలోకి వెళతారు



గీతానంద్

'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా కొత్తగా చూపించాలని ప్రయత్నించాం. లూజర్ నుంచి విన్నర్‌గా హీరో ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు గీతానంద్. ఆయన హీరోగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ' మా తమ్ముడు దయానంద్ డైరెక్టర్ కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా చర్చించుకున్నాం. ఇద్దరం కలసి ఇంతకుముందు షార్ట్ ఫిల్మ్స్ చేశాం. ఈ సినిమా విషయంలో ఆ అనుభవం మాకు హెల్ప్ అయింది. నిర్మాత రవి కస్తూరి కూడా నాకు ఫ్రెండ్ కావడంతో ముగ్గురం కలసి చర్చించుకుని నిర్ణయాలు తీసుకొనే వాళ్లం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త గేమ్ వరల్డ్‌లోకి వెళ్లిపోతారు' అని చెప్పారు. సీక్వెల్ కోసం వేరే ప్లానింగ్ ఉందనీ, ఈ సినిమాకు వచ్చే రియాక్షన్ బట్టి దాన్ని ప్రకటిస్తామని తెలిపారు.



సుహాస్ హీరోగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ ఈ చిత్రం బిగ్‌టికెట్‌ను రిలీజ్ చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పన్నెండు గుంజల పందిరి కింద



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'పన్నెండు గుంజల పందిరి కింద' అంటూ సాగే గీతాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే తెలంగాణ మట్టి వాసన కనిపిస్తోంది. పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్యం, సురేశ్ బొబ్బిలి సంగీతం ఆకట్టుకున్నాయి. ఇకపై ప్రతిపెళ్లిలో ఈ పాట వినిపిస్తుంది' అన్నారు. మా సినిమాకు ఈ పాట ప్రత్యేకాకర్షణ అవుతుందని దర్శకుడు తెలిపారు.

ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో...

'బిగ్‌బాస్' అమర్‌దీప్ హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నటించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత ఎ.ఎం.రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ ఇచ్చారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ



'భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లకముందే ఈ సినిమాకు సైన్ చేసినట్లు హీరో అమర్‌దీప్ చెప్పారు. నటి సురేఖా వాణి మాట్లాడుతూ 'ఈ ప్రాజెక్ట్ విన్న తర్వాత వీళ్లు చేస్తారా లేదా అనే అనుమానం వచ్చింది. దర్శకనిర్మాతల మీద నమ్మకంతోనే నా బిడ్డను వాళ్ల చేతులో పెట్టా' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: బాల సరస్వతి.

విశ్వంభర కోసం సన్నద్ధం



చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండడంతో చిత్రీకరణలో పాల్గొనేందుకు చిరంజీవి సన్నద్ధమవుతున్నారు. సరికొత్త లుక్‌లో కనిపించేందుకు జిమ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియోను గురువారం ఆయన సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. 'విశ్వంభర' కోసం సిద్ధమవుతున్నానని ఆ వీడియోలో చిరంజీవి తెలిపారు. యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఛోటా కే నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.

అభివృద్ధిని మరిచి.. దోపిడీ మరిగారు

మూడు ముక్కల ఆటతో రాష్ట్రం అధోగతి

1507వ రోజు ఆందోళనల్లో అమరావతి రైతులు



మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్లూరు ఫిబ్రవరి 1: వైసీపీ పాలకులు వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధిని పూర్తిగా మరిచి, దోచుకోవడం మరిగారని రాజధాని రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తోన్న ఆందోళనలు, నిరసన దీక్షలు గురువారానికి 1507వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి అధోగతిపాలు చేశారన్నారు. అభివృద్ధి ఎక్కడా లేదని, అంతా అవినీతిమయం అయిపోయిందన్నారు. ఏ వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదన్నారు. బటన్ నొక్కి డబ్బులేసి జనాన్ని జగన్‌రెడ్డి మభ్యపెడుతున్నారన్నారు. సీఎం జగన్ పన్నుల బాదుడుతో రూపాయి ఇచ్చి పది రూపాయలు కాజేస్తున్నాడని జనం తెలుసుకున్నారన్నారు. అమరావతిని నిర్వీర్యం చేసి రైతులను అష్టకష్టాలు పెడుతున్నారన్నారు. తమను నడి రోడ్డు మీదకు లాగిన జగన్‌రెడ్డి అంతకంత అనుభవించక తప్పదన్నారు. రాజధాని గ్రామాల్లో అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

గిరిజన సంక్షేమంపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి డైరెక్టర్ స్పందన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణకు ఆదేశించారు. 'వంటోళ్లే వార్డెన్లు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ స్పందించారు. ఉద్యోగ నియామకాలు, బదిలీలపై విచారణ చేపట్టాలని విద్యా శాఖ డైరెక్టర్‌ని ఆదేశించారు. ఏసీబీ తనిఖీల తర్వాత కూడా వార్డెన్‌పై చర్యలు తీసుకోకపోవడంపై కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఆర్‌వోఆర్ ఫైల్ మాయం?

గుంటూరు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అక్రమాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా ఆ శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా ఉద్యోగుల ఆర్‌వోఆర్ ఫైల్(రూల్ ఆఫ్ రిజర్వేషన్) మాయమైనట్లు సమాచారం. ఉద్యోగోన్నతుల్లో అత్యంత కీలకపాత్ర పోషించే ఈ ఫైల్ మాయం కావడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తగిన అర్హత లేకపోయినా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా పనిచేసిన ఉద్యోగి హయాంలోనే ఆర్‌వోఆర్ ఫైల్ మాయమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యార్థులకు అన్యాయం

కొందరు అధికారుల అవినీతి వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంక్షేమ సంఘ నేత చంద్రానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కొందరికి కోట్ల రూపాయలు సంపాదించి పెట్టే కల్ప తరువుగా మారిందని ఆరోపించారు. పిల్లలు లేకుండానే ఉన్నట్లు చూపించి నిధులు డ్రా చేసిన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అర్హత లేని వ్యక్తులు ఉన్నత స్థాయిలో ఉంటే నిజమైన గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

హైదరాబాద్‌పై జార్ఖండ్ ఘనవిజయం



ప్రియాంక లూథ్రా, పల్వికా రాథోడ్, జాస్మిన్ గిల్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1: బీసీసీఐ మహిళల అండర్-23 వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ మైదానంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై జార్ఖండ్ ఘనవిజయం సాధించింది. జార్ఖండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 45.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి కేవలం 139 పరుగులు మాత్రమే చేయ గలిగింది. హైదరాబాద్ జట్టులో టీ.చందన 30 పరుగులు, ఎం.సాక్షీరావు 28 పరుగులు సాధించగా, జార్ఖండ్ బౌలర్ పల్వికారాథోడ్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు 41.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 142 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జార్ఖండ్ బ్యాటర్లు ప్రియాంక లూథ్రా 69 పరుగులు, శిఖా 40 పరుగులు చేయగా, హైదరాబాద్ బౌలర్ జాస్మిన్ గిల్ 3 వికెట్లు తీసింది. మంగళగిరి ఏసీఏ మైదానంలో తదుపరి మ్యాచ్ జార్ఖండ్, ఉత్తరాఖండ్ జట్ల మధ్య ఈ నెల 3న జరగనుంది.

ప్రజల్ని చైతన్య పరిచే అద్భుత కళ.. యక్షగానం

చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య

అట్టహాసంగా ప్రారంభమైన విజ్ఞాన్ మహోత్సవం



గడ్డం సమ్మయ్యను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1: ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు యక్షగానం కళ ఎంతో దోహదపడిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తెలిపారు. చిన్న వయస్సు నుంచే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన మద్యపాన నిషేధం, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, హెచ్ఐవీ వంటి కార్యక్రమాలపై వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చానని తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో గురువారం విజ్ఞాన్ మహోత్సవ్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళైన చిందు యక్షగానానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత చదువుకే పరిమితం కాకుండా యోగ, సంగీతం, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన డంతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని దానిని వెలికితీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. యువత తమ సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. యువత కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విజ్ఞాన్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ వర్సిటీ గడిచిన 20 ఏళ్ల నుంచి నిరంతరాయంగా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్విరామంగా చేస్తున్నామని తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో 75 ఈవెంట్లను ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం, యోగాతోనే సాధ్యమని చూపించిన నృత్య ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

అనుమతులు చూపించే వరకు తవ్వకాలు నిలిపి వేయాలన్న గ్రామస్తులు



ఇసుక తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్తులు

కొల్లూరు, ఫిబ్రవరి 1: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఊరు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని తవ్వకాలను మండల పరిధిలోని పెదలంక గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. అనుమతులు చూపించాలని పెద్దసంఖ్యలో గ్రామస్తులు వెళ్లి జీసీకేసీ నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. ఇష్టానుసారంగా ఎక్కడిబడితే అక్కడ పెద్దపెద్ద గోతులు పెట్టి తవ్వకాలు చేస్తే వరద నీరు గ్రామాల్ని ముంచి వేస్తుందని మండిపడ్డారు. గతంలో వరదల వల్ల విరిగిపోయిన పొలాల్లో ఇసుక మేటలను అనుమతులు లేకుండా ఎలా తవ్వుతున్నారని ప్రశ్నించారు. అనుమతులు చూపించాలని, అప్పటి వరకు తవ్వకాలు చేస్తే సహించేది లేదన్నారు. అనుమతులు ఉన్నాయని వాట్సాప్‌లో పంపిస్తామని చెప్పినా పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో యంత్రాలతో నిర్వాహకులు వెళ్లిపోయారు.

చంపినా సరే వైసీపీలో కొనసాగం

ఎమ్మెల్యే నుంచి బెదిరింపు కాల్స్

గురజాల వైసీపీ కౌన్సిలర్ అనిత



మహంకాళి అనితనీలంరాజు

గురజాలటౌన్, ఫిబ్రవరి 1: చంపినా సరే తాము వైసీపీలో కొనసాగేది లేదని, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి తలవంచేది లేదని 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మహంకాళి అనితనీలంరాజు తేల్చి చెప్పారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని తాము ఎన్నో కష్టాలు పడ్డామని, ఇందుకు సరైన గుణపాఠం చెప్పార ని ఆవేదన వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా తాను, తన భర్త రాజీనామా ప్రకటించామన్నారు. దీంతో తన భర్తకు కొద్ది రోజులుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. మాలధారణలో ఉన్న తన భర్త బుధవారం వీరభద్రస్వామి ఆలయానికి సద్ది కోసం వెళ్తుండగా మాచవరం ఎస్ఐ సమీర్‌బాషా కానిస్టేబుళ్లు వచ్చి బలవంతంగా తీసుకెళ్లారన్నారు. కౌన్సిలర్ భర్త నీలంరాజు మాట్లాడుతూ పోలీసులు చిత్రహింసలు పెట్టి కొట్టారన్నారు. తమకు ప్రాణహాని ఉందని దంపతులు తెలిపారు. ఎన్నికల్లో సీటు ఇచ్చి రూ.9 లక్షలు డబ్బులు ఇచ్చామని, తమాషా ఆడుతున్నావా అంటూ నీలంరాజుపై ఎమ్మెల్యే కాసు మండిపడిన ఆడియో కాల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయనున్నట్లు అనిత నీలంరాజు ప్రకటించారు. భార్యాభర్తలు గతంలో వైసీపీకి రాజీనామా చేయగా తాజాగా కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తాము ఊర్లో లేనందున ఈనెల 5న మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తామని తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు మోటారు సైకిళ్లపై గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో వారిని మీడియా ఎదుట హాజరుపరిచి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి వివరాలు తెలిపారు. అరెస్టు అయిన వారిలో హైదరాబాద్‌లోని పురాణాపూల్‌కు చెందిన చింతల కుట్టి శివకుమార్(19) ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ గులబీగూడ గ్రామానికి చెందిన కిముడు శంకర్(19) ఉన్నారన్నారు. వీరు విశాఖపట్నం జిల్లా సీలేరు వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ మరో ముగ్గురు యువకులు కలిసి మోటారు సైకిళ్లపై విశాఖపట్నం జిల్లా సీలేరుకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి అదే మోటారు సైకిళ్లపై హైదరాబాద్ బయల్దేరారు. ఈ సమాచారం తెలిసి వారిలో ఇద్దరిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. వారి నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ.10 లక్షలు అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బస్తీలు, కళాశాలల్లో విక్రయించి డబ్బు సంపాదించాలని గంజాయిని రవాణా చేస్తున్నట్లు తమ విచారణలో వారు తెలిపారన్నారు. సమావేశంలో ఎస్ఐలు జీ రవికృష్ణ, ఈ బాలకృష్ణ, జే శామ్యూల్ రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాదంలో ఉన్న భూమి మంత్రి అంబటి కొనుగోలు



విలేకరులతో మాట్లాడుతున్న కొత్తపల్లి విజయ ప్రసాద్, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: కోర్టు వివాదంలో ఉన్న తమ భూమిని మంత్రి అంబటి రాంబాబు కొనుగోలు చేశారని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ఎంవీపాలేనికి చెందిన కొత్తపల్లి విజయప్రసాద్ తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలో సర్వే నెంబరు 298/2ఏలో తమ నాయనమ్మ సరోజనమ్మకు రెండు ఎకరాలకు పైగా భూమి ఉండగా 2013లో కొందరు తప్పుడు సర్వే నెంబరుతో ఆ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. దీనిపై 2014లో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా ఆ భూమిని మంత్రి అంబటి రాంబాబు 18 జూలై 2022న తాడికొండ మండలం పొన్నెకల్లుకి చెందిన బొడ్డపాటి శివకృష్ణతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సమాచారం తెలుసుకున్న తాము కోర్టు ద్వారా మంత్రికి నోటీసులు కూడా జారీ చేశామన్నారు. అంబటి బినామీగా ధూళిపాళ్ళకు చెందిన రావిపాటి పురుషోత్తం పవర్ ఆఫ్ అటర్నీ రాయించుకున్నారన్నారు. అంబటితో తనకు ప్రాణ భయం ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి మాట్లాడుతూ అంబటి అవినీతిపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తామని తెలిపారు.



భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మంత్రి అంబటి రాంబాబు, రాయపాటి పురుషోత్తమరావు కాపీ

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

తాడికొండ, ఫిబ్రవరి 1: ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడటంతో డ్రైవర్ వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన పల్లపాటి కోటేశ్వరరావు(50) మృతి చెందాడు. తాడికొండ-కంతేరు రోడ్డులో గురువారం ఈ ఘటన జరిగింది. తాడికొండ మండలం కంతేరు నుంచి తాడికొండ అడ్డరోడ్డుకు ముగ్గుర్ని ఆటోలో ఎక్కించుకుని కోటేశ్వరరావు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

ప్రీ ఆడిట్ కు 10 శాతం : ఖజానా కార్యాలయంలో వసూళ్లు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. తోటి ప్రభుత్వ ఉద్యోగులన్న కనికరం లేకుండా ప్రీ ఆడిట్‌లో ముక్కు పిండీ వసూలు చేయడం వివాదాస్పదమౌతోంది. బిల్లు పాస్‌కు అంతోఇంతో ఇవ్వాలని కాకుండా, కచ్చితంగా 10 శాతం ఇవ్వాల్సిందే అంటూ పట్టుపట్టడంపై బాధిత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉద్యోగికి రూ.13 లక్షలు బకాయిలు రావాల్సి ఉండగా ప్రీ ఆడిట్ చేసిన అధికారులు రూ.1.30 లక్షలు ఆశించినట్లు ఆరోపణలున్నాయి. అందుకు సదరు ఉద్యోగి ఒప్పుకోకపోవడంతో దానిని మధ్యలో నే నిలిపివేశారని తెలిసింది. కొందరు రోజువారీ జీతంతో పనిచేస్తున్న ఉద్యోగులు తమ పర్మినెంట్ కోసం కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకుకోగా ప్రభుత్వం జీవో 610 విడుదల చేసింది. ఈ జీవో కింద నియమితులైన ఉద్యోగుల వద్ద ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి.

ఉపేక్షించేది లేదు..

అవినీతికి పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని జిల్లా ఖజానా అధికారి రాజగోపాలరావు అన్నారు. అధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

1,20,528 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,034 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,20,528 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 79,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	13000	19000
273	8500	17500
341	9000	21200
4884	11000	16500
సూపర్ 10	15000	17500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9500	20500
దేవనూరు డీలక్స్	9500	20000
తెల్లకాయలు	5000	12500

డీఎస్సీ పేరిట జగన్ మరో మోసం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 1: డీఎస్సీకి మంత్రి వర్గ ఆమోదం అంటూ మరోసారి నిరుద్యోగులను తనదైన శైలిలో మోసం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో హామీ ఇచ్చిన మెగా డీఎస్సీ ఏమైందో ఇప్పటికైనా సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ జగన్ సర్కారు నిరుద్యోగ యువతను మోసం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాగానే యువతకు 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని చెప్పారన్నారు, ఆ మాటలు నమ్మి డీఎస్సీ కోసమే ఏడు లక్షల మంది నిరుద్యోగులు నిద్రాహారాలు మాని, అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటూ కష్టపడుతున్నారన్నారు. ఐదేళ్లుగా వారి జీవితాలతో చెలగాట మాడింది కాకుండా ఇప్పుడు ఆరు వేల పోస్టులతో నోటిఫికేషన్ అనడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులోనూ రెండేళ్ల గౌరవ వేతనంతో అప్రెంటీస్ విధానం తిరిగి తీసుకురావడం దారుణం, నయవంచన అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్ చెప్పిన 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఐదేళ్ల తర్వాత కూడా ఆరు వేలకు ఎలా తగ్గాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌రెడ్డి కుర్చీ పీకడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో జగన్ దగా : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: మెగా డీఎస్సీ పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసమే డీఎస్సీ ఇచ్చినట్లు అర్థమవుతుందన్నారు. గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక ఐదేళ్లు ఆ మాట మరచి పోయాడన్నారు. దిగి పోయే ముందు ఆరు వేల పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించటం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. 2019 నుంచి ఒక్క డీఎస్సీని కూడా విడుదల చేయలేదన్నారు. జీవో 117తో ఉన్న ఖాళీలను కుదించి వేశారన్నారు. తక్కువ పోస్టులతో ప్రకటన జారీ చేయడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు నిరాశ మిగిలిందని తెలిపారు. నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్నారు

వైసీపీ నేతలపై మాజీ ఎమ్మెల్యే యరపతినేని ధ్వజం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1: గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు ఆక్రమించుకుని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందరు రెవెన్యూ అధికారుల అండతో అమ్మేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అయినా రెవెన్యూ శాఖ మౌనం దాల్చడంపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సర్వే నెంబర్లు, రెవెన్యూ రికార్డుల మార్పులు చేసి భూములను కాజేసిన వైసీపీ నేతలు వాటిని బ్యాంక్‌ల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారన్నారు. అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. చెరువు, వాగు పోరంబోకు భూములపై నిషేధం ఉన్నా ఆక్రమించుకుని రిజిస్టర్ చేయించుకుంటున్నారన్నారు. పిడుగురాళ్ల చెరువు భూములను విక్రయిస్తున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, పిడుగురాళ్ల వీఆర్వో సత్యారెడ్డి, స్టాంపు రైటర్ లింగారెడ్డి బైపాస్ రోడ్డు సమీపంలోని సర్వే నెంబరు 579, మరికొన్ని నెంబర్లతో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు, సబ్ రిజిస్ట్రార్‌లు విచారణ జరిపి రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ప్రభుత్వ భూమిగా ప్రకటించాలన్నారు. వైసీపీ భూ మాఫియాపై ప్రజాప్రభుత్వంలో విచారణ జరిపి, వారికి సహకరించిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులపై దాడి చేయించిన ఎమ్మెల్యే బొల్లా : జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 1: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో రైతులపై దాడులు చేయించి వారి పైర్లను కోయించి రౌడీయిజం చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో జీవీ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం వెల్లటూరులో బేతపూడి అమరలింగయ్య అనే రైతు మిర్చి సాగు చేయగా ఆ భూమిని తన మనమరాలికి ఇచ్చేందుకు ఎమ్మెల్యే బొల్లా సిద్ధమయ్యారన్నారు. అమరలింగయ్య భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఆయన కలెక్టర్, జేసీ, డీఆర్వో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో గవర్నర్‌ను బాధిత కుటుంబం కలసి ఫిర్యాదు చేసిందన్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు స్పందించి ఆ భూమి అమరలింగయ్యదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారన్నారు. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డం పెట్టుకుని వినుకొండలోని తన అనుచరులతో సాగులో ఉన్న మిర్చి పంటను, నీళ్ల పైపులను కోయించి పొలంలోని రెండు బోర్లను పూడ్చివేయించారన్నారు. తమపై దౌర్జన్యంచేసి, దాడి చేశారని బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో అమరలింగయ్య కుటుంబం ఫిర్యాదు చేసి ఆరు రోజులైనా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అమరలింగయ్య మిర్చిపంటను, బోర్లను ధ్వంసం చేసిన దుండగలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

బీసీలను అవమానించిన వైసీపీ ప్రభుత్వం

పల్నాడు జిల్లా బీసీలను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా అవమానించిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లాలో బీసీలు లేనట్లుగా నెల్లూరు నుంచి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను ప్రకటించడంపై ప్రజలు వైసీపీని ఛీ కొడుతున్నారన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా అక్రమ సంపాదనకు పాల్పడ్డారని, నెల్లూరులో బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అక్కడ చెత్త ఇక్కడ బంగారమెలా అవుతుందో చెప్పాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూసి పదవులు, రిజర్వేషన్లలో కోత విధించడం వల్ల 12 వేల మంది బీసీలు పదవులను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు బీసీల అభ్యున్నతికి సబ్‌ప్లాన్ ద్వారా రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం వాటిని తొలగించి బీసీలను మోసం చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ సాధికార సమితి అధ్యక్షుడు మానుకొండ శివప్రసాదరావు, నాగేశ్వరరావు, గోవిందనాయక్, ఆయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

టీడీపీతోనే మహిళల అభివృద్ధి : సీత


6వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే మహిళా సాధికారత జరుగుతుందని పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత తెలిపారు. బుధ, గురు వారాలలో పట్టణంలోని 6, 7 వార్డులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా శక్తి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత బస్సు ప్రయాణం పథకాలతోపాటు మహిళల ఆర్థికాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని వివరించారు. మహిళలందరూ ఏకతాటిపై నిలిచి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని సీత కోరారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రమణ, కోమటినేని లక్ష్మీ, చల్లా అంజమ్మ, శారద, పున్నం భారతి, రావినూతల కోటేశ్వరరావు, ఇనుముక్కల వరప్రసాద్, గుజ్జర్లపూడి పురుషోత్తం, చల్లగుండ్ల పేతురు, కుక్కమూడి జార్జి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కటకం జయశ్రీ

దాచేపల్లి, ఫిబ్రవరి 1 : గ్రామాలలో రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని దాచేపల్లి ఎంపీపీ కటకం జయశ్రీ అధికారులను కోరారు. దాచేపల్లి మండల పరిషత్ మీటింగ్ హాలులో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య వుందో గుర్తించి బోర్లు వేయడం, గ్రామాలలోని చెరువులను తాగునీరు తో నింపడం చేయాలన్నారు. జడ్పీటీసీ మూలగుండ్ల కృష్ణకుమారి మాట్లాడుతూ గ్రామాలలో సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజాప్రతినిధులు వీలైనంత త్వరగా రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామాలలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి పింఛన్లు, ఇళ్లస్థలాలు అందజేయాలని అధికారులను కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనింగ్, తదితర శాఖల అధికారులు తమశాఖలు చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో ఉప ఎంపీపీ కందుల జాన్, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ బత్తుల లింగారెడ్డి, ఎంపీటీసీ చిట్టిపోగు ఏసుదానం, సర్పంచ్‌లు కూసం నాగిరెడ్డి, వినుకొండ కోటేశ్వరరావు, శానం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1 : మండలంలోని పలు గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్‌తో తాగునీటిని అందించే పనులను గురువారం ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. జానపాడు, పందిటివారిపాలెంలో ఇంటిం టికి కుళాయి ద్వారా తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయడంతో పాటు జానపాడులో వైఎస్ఆర్ ఆసరా పంపిణీ అనంతరం సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, జానపాడు నుంచి గుత్తికొండ వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన, జూలకల్లులో బస్సు షెల్టర్, వైఎస్ఆర్ ఆసరా, ఎస్సీ కాలనీలోని చర్చి సెంటర్ వద్ద వైఎస్ఆర్ ఆసరా, జూలకల్లు హైస్కూల్‌లోను వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో పలువురు వైసీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ఉపాధ్యాయుడికి ప్రథమ బహుమతి



మొదటి బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు అంకమయ్య

మాచవరం ఫిబ్రవరి 1: విజయవాడలో గత నెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.అంకమయ్యకు ప్రథమ బహుమతి లభించింది. ఆధునిక వీధి దీపం స్తంభం ప్రాజెక్టును ఇండస్ట్రియల్ ప్రైజ్‌గా అంకమయ్యకు అందజేశారు. ఎస్‌సీఈఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అంకమయ్యకు బహుమతి ప్రదానం చేశారు. విజయవాడలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, విద్యాకమిటీ చైర్మన్ నీలం వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు అంకమయ్యను అభినందించారు.

నేడు రెంటచింతల కానుకమాత తిరునాళ్ల


విద్యుత్ దీప కాంతులలో కానుకమాత చర్చి

రెంటచింతల, ఫిబ్రవరి 1 : రెంటచింతలలో 1850లో నిర్మితమైన కానుకమాత చర్చి భక్తుల అచంచల విశ్వాసానికి చెక్కు చెదరని సాక్ష్యంగా నిలిచింది. 174 సంవత్సరాల నుంచి ఫిబ్రవరి 2న కానుకమాత తిరునాళ్ల మహోత్సవం జరపడం ఓ సంప్రదాయంగా ఉందని ఫాదర్ వైఎల్.మర్రెడ్డి అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నల్గొండ బిషప్ గోవింద జోజి నేతృత్వంలో దివ్య పూజబలి ఉంటుందన్నారు. అలాగే రాత్రి వేళల్లో బాణసంచా కాలుస్తూ సుమారు 8 గంటల పాటు తేరును ఊరేగించడం జరుగుతుందన్నారు. వెలుగుతున్న కొవ్వొత్తిని కానుకగా సమర్పించి తమ జీవితాల్లో కాంతులను నింపాలని భక్తులు కోరుకుంటారు.

సీపీఎస్ రద్దు చేసే వారికే మా ఓటు

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్

మాచర్ల, ఫిబ్రవరి 1 : ఏ పార్టీ అయితే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తారో ఆ పార్టీకే తాము ఓటు వేస్తామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఎస్టీయూ ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రస్తుత ప్రభుత్వం తిరోగమన దిశగా పయనిస్తోందన్నారు. సీపీఎస్ రద్దు హామీతో అధికారంలోకి వచ్చి జీపీఎస్ గుదిబండను రుద్దుతోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్‌బాబు, నరసింహారావు, కిషోర్, బాలునాయక్, రాజశేఖర్, విల్సన్, జబ్బార్, అనంతరామయ్య, రత్యానాయక్, నబీ సాహెబ్, గురవయ్య, హరినాయక్, అపర్ణ, రత్నమంజరి, సంపూర్ణబాబు, సుభాని, వెంకటేశ్వర్లు, భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● గుజ్జర్లపూడి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కన్నా


మహిళలకు నమస్కరిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 1 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రజల భవిష్యత్ కూడా బాగుంటుందని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుజ్జర్లపూడి గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం కన్నా ప్రత్యేక పూజలు నిర్వహించి తన ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనం అయిందన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు అందించి పథకాలను వారికి వివరించారు. త్వరలోనే తెలుగుదేశం ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, గ్రామంలో నెలకొన్న సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయన్నారు. గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్టా శివ పార్వతి చలమయ్య, పార్టీ నాయకులు ఎలినేడి రామస్వామి, భీమినేని వందనాదేవి, చౌట శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, మక్కపాటి రామచంద్రరావు, కోమటినేని శ్రీనివాసరావు, గంగూరు అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన ప్రభుత్వం : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 : రాష్ట్రంలోని దళితులను వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేసిందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుజ్జర్లపూడిలో గురువారం దళిత చైతన్య యాత్రల కరపత్రాలను ఆయన పార్టీ నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల జగన్ పాలనలో ఎస్సీలకు ఖర్చు చేయాల్సిన రూ.1.14 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేయకుండా మోసం చేసిందన్నారు. దళితుల సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొక్కా సంగీతరావు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దళిత చైతన్య యాత్రలు నిర్వహించి ప్రభుత్వం దళితులకు చేసిన మోసాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, వర్ల శ్రీను, బొజ్జా కాంతారావు, వెంకటరావు, శనగపూల నరసింహారావు, గుజ్జర్లపూడి శాలిని, వెలిశల వెంకటరావు, గొర్రి రాంబాబు, టీడీపీ నేతలు ఉన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కన్నా పూజలు

రాజుపాలెం, ఫిబ్రవరి 1 : బెల్లంకొండ అడ్డరోడ్డు సమీపంలో ఉన్న కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్వామివారికి మొక్కుకున్నట్లు కన్నా తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపాటి పెద్దిరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


హనుమాయమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

యాగంటికి మాతృవియోగం

మాచర్ల, ఫిబ్రవరి 1 : టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి హనుమాయమ్మ (94) గురువారం అనారోగ్యంతో మరణించారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వీరిలో పెద్ద కుమారుడు యాగంటి మల్లికార్జునరావు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, టీడీపీ నేతలు యాగంటి గృహానికి చేరుకొని హనుమాయమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, సాదనాల నరసయ్య, కుర్రి శివారెడ్డి, బండ్ల శ్రీనివాసరావు, కొమెర దుర్గారావు, డాక్టర్ రామకోటయ్య, బీజేపీ నేతలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 1: విద్యారంగాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగంపై చిన్నచూపు చూపుతోందన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఇంతవరకు జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం అన్నారు. చెన్నం రాజు, జలగం ఉషాకుమార్, నాగేశ్వరరావు, వంశి, కోటేశ్వరరావు, నరేంద్ర, హరి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటా : ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, ఫిబ్రవరి 1 : నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి ఎటువంటి కష్టమొచ్చినా పెద్ద కొడుకులా ఆదుకుంటానని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో గురువారం జరిగిన వైఎస్ఆర్ 4వ విడత ఆసరా ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పట్టణ పరిధిలోని 684 సంఘాలకు రూ.7,86,15,318 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్ తురకా కిషోర్, బోయ రఘురామిరెడ్డి, కౌశల్, మెప్మా సీఎంఎం సుబ్బారావు, సీవోలు రాజశేఖర్, అంజలి, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

నేడు వైఎస్ఆర్ నాల్గవ విడత ఆసరా ప్రారంభం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 1: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మాచర్ల మండల పరిధికి సంబంధించి వైఎస్ఆర్ 4వ విడత ఆసరా కార్యక్రమం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించనున్నారు.

పిన్నెల్లి సోదరులను కలుసుకున్న కమిషనర్ వెంకటదాసు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 1: మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటదాసు గురువారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కలను అందించారు.

పిడుగురాళ్ల ఎంపీడీవోగా సుబ్బారావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1 : పిడుగురాళ్ల మండల పరిషత్ అధికారిగా ఇ.సుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నుంచి సుబ్బారావు పిడుగురాళ్లకు బదిలీపై రాగా ఇక్కడ పని చేస్తున్న కాశయ్య సంతమాగులూరు ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

మాచవరం ఎంపీడీవోగా సురేష్

మాచవరం ఫిబ్రవరి 1 : మాచవరం మండల ఎంపీడీవోగా సురేష్ నియమితులయ్యారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వరప్రసాద్ ప్రకాశం జిల్లాకు వెళ్లారు. ప్రకాశం జిల్లా నుంచి సురేష్ మాచవరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. అదేవిధంగా ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ప్రసాద్ బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శంకరరావు

రెంటచింతల, ఫిబ్రవరి 1 : కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలంలో పని చేస్తున్న పి.శంకర్‌రావు బదిలీపై రెంటచింతల ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి దాకా ఇక్కడ పనిచేసిన మహాలక్ష్మి ప్రకాశం జిల్లా నాగులుప్పాడుకు బదిలీ అయ్యారు.

ఆర్గానిక్ పంటలను పరిశీలించిన విదేశీ బృందం

అమరావతి, ఫిబ్రవరి 1 : మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలో సాగులో ఉన్న ఆర్గానిక్ పంటలను యూకేకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్బర్గ్ బృందం గురువారం సందర్శించింది. ఆర్గానిక్ పద్ధతిలో సాగవుతున్న మిరప, బొప్పాయి, పత్తి పంటలను బృందంలోని సభ్యులు హిషాని, ధన్య పరిశీలించారు. ఆర్గానిక్ పంటల దిగుబడితో ఆరోగ్యంతో పాటు భూములలో సారవంతం పెంపొందుతుందని బృందంలోని సభ్యులు తెలిపారు. వీరితో పాటు ఆర్ఎం వెంకట్రావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు అమల కుమారి, రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ ఉదయ్, ఆదినారాయణ, నందకుమార్, సైదయ్య, రాజు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యంపై అవగాహన

అచ్చంపేట, ఫిబ్రవరి 1 : అచ్చంపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ టీచింగ్‌కు సంబంధించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు ఒకేషనల్ టీచర్ కట్టా శివన్నారాయణ తెలిపారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సచివాలయాలు, డిజిటల్ కంప్యూటర్ పరిజ్ఞానం గురించి క్లుప్తంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ.అరుణ్ కుమార్ సహకా రంతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు.

ఆరుతడులకు నీరు అందించలేని అసమర్థ ప్రభుత్వం : టీడీపీ

అచ్చంపేట, ఫిబ్రవరి 1 : ఆరు తడులకు నీరు అందించలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వం అని టీడీపీ మండల నాయకులు అన్నారు. గురువారం రాత్రి పెదపాలెం గ్రామంలో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమం మండల టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, నల్లమోతు హరిబాబు, నెల్లూరి వెంకటయ్య, పరిమి శ్రీను, నెల్లూరి వెంకటేశ్వర్లు, గొంతు వెంకటేశ్వర్లు, నెల్లూరి కొండయ్య, కోట చంటి, నల్లమోతు వెంకయ్య పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 : ఎన్నికల బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి డీఎస్పీ బీ.ఆదినారాయణ రాజమండ్రి దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమండ్రిలో డీఎస్పీగా పని చేస్తున్న జీసీ గురునాథబాబును నియమించారు. సత్తెనపల్లి రూరల్ స్టేషన్ సీఐగా ఎం.రాజేష్ కుమార్ నియమితులయ్యారు. ఆయన ప్రకాశం జిల్లా కంభం సర్కిల్ నుంచి బదిలీపై వచ్చారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐగా మీసాల రాంబాబు నియమితులయ్యారు. ఆయన పొన్నూరు రూరల్ సర్కిల్ నుంచి బదిలీపై వచ్చారు. సత్తెనపల్లి ఆర్డీవోగా పని చేస్తున్న రాజకుమారిని ఏలూరు బదిలీ చేశారు. ఆమె స్థానంలో గుడివాడ మునిసిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న మురళీకృష్ణను ఆర్డీవోగా నియమించారు.

అక్రమ మద్యం స్వాధీనం

వెల్దుర్తి, ఫిబ్రవరి 1 : మండలంలోని యర్రబాలెంలో గల నాగేంద్ర స్వామి ఆలయం ముందు గురువారం సెబ్ అధికారులు దాడులు జరిపారు. 20 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న మండి పెద్ద పిన్నయ్యని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అచ్చిరెడ్డికి నివాళులర్పించిన వెంకట్రామిరెడ్డి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 1: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన మధిర అచ్చిరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గురువారం అచ్చిరెడ్డి గృహానికి చేరుకొని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

కారంపూడి ఎంపీపీగా బొమ్మిన సావిత్రి

కారంపూడి, ఫిబ్రవరి 1: కారంపూడి ఎంపీపీగా కారంపూడి 2 ఎంపీటీసీ బొమ్మిన సావిత్రి అల్లయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఎంపీపీగా మేకల శారదా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

క్రోసూరు, ఫిబ్రవరి 1 : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎర్రబాలెంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన పసుపులేటి రాంబాబు(38) కుటుంబంలో భార్య, భర్తల మధ్య, ఇతర కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గృహంలోని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని బంధువులు తెలిపారు. అతనికి భార్య అంజలి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. క్రోసూరు పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

పురుగు మందు తాగి...

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 : పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియదాసు (37) మూడు ఎకరాల పొలం తీసుకొని సాగు చేస్తున్నాడని, బుధవారం పొలం కౌలుకు సంబంధించిన విషయంలో ఘర్షణ జరిగి పురుగు మందు తాగటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా

నకరికల్లు, ఫిబ్రవరి 1 : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా చెక్కులను మంత్రి అంబటి రాంబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఏపీఎం సునీత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి : కొమ్మాలపాటి

బెల్లంకొండ, ఫిబ్రవరి 1 : ప్రతి టీడీపీ కార్యకర్త గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గురువారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నడుం బిగించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు రావటం కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, వైసీపీ చేసిన అరాచకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళాలని ఆయన సూచించారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు, పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ జెండాను రెపరెపలాడించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్‌లో చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోను ఏ విధంగా ఏర్పాటు చేస్తారో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వెన్నా వెంకటరెడ్డి, పీఎస్‌కే రసూల్, ఎస్.పిచ్చయ్య, సయ్యద్ జానీ, గుడిసె కొండయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశవరావు మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

పెదకూరపాడు, ఫిబ్రవరి 1 : టీడీపీ సీనియర్ నాయకులు ఘంటా కేశవరావు మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని పరస గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఘంటా కేశవరావు(87) అనారోగ్యంతో మృతి చెందారు. శంకరరావు మృతదేహాన్ని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేశవరావు మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర నాయకుడు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, టీడీపీ సీనియర్ నేతలు సరిపూడి నాగేశ్వరరావు, సత్తెనపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెనుముచ్చు రామారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, కన్నధార వసంతరావు, టీడీపీ మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, టీడీపీ నేతలు పరుచూరి పూర్ణచంద్రరావు, బెల్లంకొండ రాంబాబు, మక్కెన సాగర్, వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ నేతలు పాల్గొని కేశవరావు మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు.


కేశవరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

అలాగే కేశవరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, బలుసుపాడు ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ బచ్చు హనుమంతరావు, మాజీ జడ్పీటీసీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, ఫిబ్రవరి 1 : బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన మురికిపూడి వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి అన్నారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ గురువారం ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు మాచాయపాలెం టీడీపీ నాయకులు గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో నగదును అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సంతాపం ప్రకటించారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో పార్టీ నేతలు బంగారయ్య, చెన్నయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైకో జగన్‌ను సాగనంపాలి : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 : రాక్షసత్వం, సైకో మనస్తత్వం కలిగిన వైఎస్ జగన్‌ను సాగనంపాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఆటోనగర్‌లో గురువారం 22 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కన్నా మాట్లాడుతూ 16 నెలలు జైల్లో ఉండి వచ్చిన జగన్ రాష్ట్ర సంపదను కొల్లగొడుతున్నారన్నారు. ఇదేమని ప్రశ్నించే వారిపై పోలీసు కేసులు పెడుతూ హింసిస్తున్నారన్నారు. రూ.12 లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చానని చెపుతున్న జగన్ రూ.2.50 లక్షల కోట్లు మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేశానని చెపుతున్నారన్నారు. మిగిలిన రూ.9.50 లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్ళాయని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రాష్ట్ర అభివృద్ధిని రివర్స్ చేశారన్నారు. వైఎస్ జగన్ రాష్ట్ర చరిత్రలో చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడన్నారు. టీడీపీ, జనసేన కూటమిని అధికారంలోకి తెచ్చుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముందుగా మిత్ర ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని కన్నా ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యూనియన్ ప్రెసిడెంట్ షేక్ శిలార్, వైస్ ప్రెసిడెంట్ కోట రాజు ఆధ్వర్యంలో 22 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో శ్రీను మేస్త్రి, మున్నా మేస్త్రి, రఫానీ, కే.వెంకటేశ్వరరావు, జీ.శ్రీనివాసరావు, బాషా తదితరులు ఉన్నారు. టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, కటకం రామకృష్ణ, ఆతుకూరి నాగేశ్వరరావు, దూద్‌కే, సయ్యద్ మాబూ, నూర్ బాషా జానీ బాబు, అబ్దుల్లా, రాంబో బుడే, ఇబ్రహీం పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభం


పాదయాత్ర చేస్తున్న బొర్రా వెంకట అప్పారావు, నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 : సత్తెనపల్లి నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి చేరువయ్యేందుకే జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు తెలిపారు. మండలంలోని కొమెరపూడి నుంచి చేజర్ల కపోతేశ్వర స్వామి దేవస్థానం వరకు గురువారం ఆయన పాదయాత్రను ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవటమే తమ లక్ష్యమన్నారు. కొమెరపూడి నుంచి ఎర్రగుంటపాడు, లక్కరాజుగార్లపాడు వరకు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను అప్పారావు, జనసేన నాయకులు అడిగి తెలుసుకున్నారు. కొమెరపూడిలోని ఆంజనేయ స్వా మి దేవస్థానంలో, ఎర్రగొండపాడు గ్రామంలోని నాగేంద్ర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఎన్‌టీఆర్, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, నాదెండ్ల నాగేశ్వరరావు, తోట నరసయ్య, సిరిగిరి పవన్, తాడువాయి లక్ష్మి, అంకమరావు, నామాల పుష్పలతతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిలిచిపోయిన కమిషనర్ రామ్మోహనరావు బదిలీ


రామ్మోహనరావు

నరసరావుపేట, ఫిబ్రవరి 1: నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ ఎం రామ్మోహనరావు బదిలీ నిలిచిపోయింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గత నెల 26న రామ్మోహనరావును ఇక్కడి నుంచి నందిగామ కమిషనర్‌గా బదలీ చేశారు. నరసరావుపేటకు పీ నిరంజన్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. అయన నియమకాన్ని రద్దు చేసి రామ్మోహనరావును కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 1: వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా పీఎల్‌బీ ఎస్ఎస్ కృష్ణవేణిని ప్రభుత్వ గురువారం నియమించింది. ఆమె గతంలో పిఠాపురం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమెను వినుకొండకు నియమించారు. ఇటీవల నియమించిన శివారెడ్డిని మూడురోజులు గడవక ముందే ఆయన్ను బదిలీచేసి ఆయన స్థానంలో కృష్ణవేణిని నియమించారు. అదే విదంగా వినుకొండలో ఏఈ విధులు నిర్వహిస్తున్న ఎం చంద్రశేఖర్‌ను మాచర్లకు బదిలీ చేయగా ఆయన స్థానంలో మాచర్లలో విధులు నిర్వహిస్తున్న జే శ్యామ్యూల్‌ను వినుకొండకు బదిలీచేశారు.

యడ్లపాడు ఎంపీడీవోగా శ్రీనివాసరావు

యడ్లపాడు, ఫిబ్రవరి 1: యడ్లపాడు ఎంపీడీవోగా వై శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. యడ్లపాడు ఎం పీడీవోగా విధులు నిర్వహిస్తున్న వై హనుమారెడ్డి గత నెల 22న సెలవుపై వెళ్లగా అప్పటి నుంచి ఈవోపీఆర్డీ వరూదిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం కార్యాలయానికి వచ్చిన ఆయన ఇన్‌చార్జి ఎంపీడీవో నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

బొల్లాపల్లి సీవీ విజయకుమార్

బొల్లాపల్లి, ఫిబ్రవరి 1: సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడు నుంచి సీవీ విజయకుమార్ గురువారం బొల్లాపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్‌కు పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

శావల్యాపురం కవితాచౌదరి

శావల్యాపురం, ఫిబ్రవరి 1: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా కొర్రపాటి కవితాచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఎంపీడీవో విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా శావల్యాపురానికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన పేరుమీన సీతారామయ్య ప్రకాశం జిల్లా కురిచేడు మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించేందుకు కార్యాలయానికి వచ్చిన ఎంపీడీవో కవితా చౌదరిని కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ లోకసభ ఎన్నికల కార్యాలయం ప్రారంభం


కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాలతో రాష్ట్రంలోని 25 పార్లమెంట్ జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల కార్యాలయాలను గురువారం ప్రారంభించారు. దానిలో భాగంగా నరసాపురం లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ప్రారంభించి ఎన్నికల నగారాను మోగించి రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో ప్రారంభమవుతున్న లోక్‌సభ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ తెరల ద్వారా బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా కార్యాలయాన్ని నరసరావుపేట లోక్‌సభ ఎన్నికల కార్యాలయంగా ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర బిల్డింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ నలబోతు వెంకటరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీవైఈవో వేణుగోపాల్

వినుకొండ, ఫిబ్రవరి 1 : మండలంలోని నడిగడ్డ గ్రామంలోని డాక్టర్ బోడెపూడి హనుమయ్య సుప్రభాత్ జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి వేణుగోపాల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్యానల్ కమిటీ, ఉపాధ్యాయుల పని తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యం, వర్కుబుక్‌లు, నోట్‌పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణ, తదితర అంశాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హేమంత్‌కుమార్, ప్యానల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా 50వ రోజుకు అన్నదాన కార్యక్రమం

బొల్లాపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన తాను స్థాపించిన ఎస్వీ ఓవర్‌సెస్ కన్సల్టెన్సీ ఎండీ పోకా వెంకటరావు తాను స్థాపించిన నిత్యాన్నదాన కార్యక్రమం 50వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ మండలానికి వివిధ పనులపై వచ్చే పేదల కోసం ఏ ఒక్కరు ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతోనే నిత్యాన్నదానాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎస్వీ చార్ట్‌ను మంచి హృదయంతో ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజు అన్నదానానికి పోకా వెంకటరావు మిత్రులైన నార్నె అమరేంద్ర, మదమంచి ఆదిత్య, మారుతీ వంశీలు పుట్టిన రోజు సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

యడ్లపాడు, ఫిబ్రవరి 1: యడ్లపాడు గ్రామనికి చెందిన డేరంగుల శింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు రూ.10 వేలు ఆర్థికసాయాన్ని ప్రకటించారు. గురువారం స్థానిక టీడీపీ నాయకులు శింగయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రత్తిపాటి ఫౌండేషన్ తరపున ప్రకటించిన ఆర్థికసాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాకుమాను చంటి, నాయకులు పోపూరి వెంకయ్య, పల్లపు బలరాం, తోరాటి వినోద్, బత్తుల సాంబశివరావు, బండారు గోపి, పోపూరి రాఘవయ్య తదితరులున్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు

వినుకొండ, ఫిబ్రవరి 1: వృత్తి విద్యా కోర్సుల అభ్యాసంతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. స్థానిక ఒకటో వార్డు బాలికల హైస్కూల్లో 9, 10వ తరగతుల విద్యార్థులకు గురువారం టెక్స్‌టైల్స్‌పై ఒకేషనల్ ట్రైనర్ శివపార్వతి యాంత్రికంగా పని చేస్తున్న పనిముట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం బీసీల పుట్టినిల్లు

● జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


జయహో బీసీ సభలో ఐక్యతను చాటుతున్న నాయకులు

నూజెండ్ల, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీ బీసీల పుట్టినిల్లు అని, బీసీలకు వెన్నుదన్నుగా ఎన్‌టీఆర్, చంద్రన్న ఉన్నారన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నూజెండ్లలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సభకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఉన్న బీసీల రిజర్వేషన్ 34 శాతంను 24 శాతానికి తగ్గించటం, బీసీ కార్పొరేషన్ రద్దు, విదేశీ విద్య అందించక పోవటం తదితర కార్యక్రమాలతో పాటు బీసీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ బలమైన నాయకులను హత్యలు చేస్తూ వెన్నెముక కులాలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు చేసిన మేలు ఒక్కటి కూడా లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇసుక, మద్యం, బియ్యం భూఅక్రమాలకు పాల్పడుతున్నాడని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బ్రహ్మనాయుడుకు శిక్షలు తప్పవన్నారు. అదేవిధంగా రాష్ట్ర యాదవ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసీల్లో చైతన్యం తెచ్చి నాయకులను చేసిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. జీవీ ఆంజనేయులును రానున్న ఎన్నికల్లో బీసీలు ఆదరించి, అభిమానించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాదు, క్రమశిక్షణా కమిటీ సభ్యులు జీ నాగేశ్వరరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ లగడపాటి వెంకటరావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, నాగశ్రీను, టీడీపీ నాయకులు బత్తుల గోవిందరాజులుయాదవ్, మీసాల మురళీకృష్ణ యాదవ్, లాయర్ సైదారావు, కొమ్మా శ్రీను, నంబుల గురునాథరావు, కమ్మ శ్రీను, నంబుల గురునాథరావు, నూజెండ్ల సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, గంగినేని ఆంజనేయులు, లగడపాటి సూరిబాబు, పీవీ సురేష్, ముంద్రు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. బీసీ సభలో మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

జగన్‌ను నమ్మితే మిగిలేది కన్నీరు కడగండ్లు

● టీడీపీ సమగ్ర శిక్షణా కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి


ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 1: జగన్‌ను నమ్మితే ఎవరికైనా చివరికి మిగిలేది కన్నీళ్ళు, కండగండ్లేనని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తమ పర అన్న భేదం లేకుండా నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరిని నిండా ముంచి నడి రోడ్డు పై వదిలి వేయటమే అతనికి తెలిసిన విద్య అని ఆయన ఎద్దేవా చేశారు. షర్మిల, ఆర్కే, బాలినేని మొదలు ఇటీవల వైసీపీ అభ్యర్థిత్వాల ఖరారులో బదిలీ అయిన వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జ్‌ల కథలే ఇందుకు నిదర్శనం అన్నారు. చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో గురువారం జరిగిన ఇంటిగ్రేటెడ్ సమగ్ర శిక్షణా కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధానంగా ప్రజలతో ఏ విధంగా మమేకం అవ్వాలి?, ఓటరు జాబితా పరిశీలన, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని దిశ నిర్దేశం చేశారు. బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటు ఫర్ టీడీపీ కార్యక్రమాల పై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలోని ప్రతి ఇంటికి వెళ్ళి లోటు పాట్లు పరిశీలించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు, పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్ళటం లక్ష్యంగా చేసుకొని పార్టీ శ్రేణులంతా శ్రమించాలని, బూత్ యూనిట్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ మండల కమిటీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం మాట్లాడుతు జగన్ వ్యక్తి గత రాజకీయ జీవితాల్లో పదేళ్ల క్రితం దగ్గరగా ఉన్నది ఎవరు?, ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారో గమనిస్తే అతని విశ్వసనీయత ఏంటో ఇట్టే అర్థమవుతుందన్నారు. నమ్మించి తడిగుడ్డతో గొంతలు కోసే మనస్తత్వం ఉన్న వ్యక్తికి అధికారం ఇచ్చి రాష్ట్ర ప్రజలు కూడా అన్ని విధాలా నష్టపోయారని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకు త్వరలోనే గుర్తింపు

● పట్టణ అధ్యక్షుడిగా సమద్‌ఖాన్, కార్యదర్శిగా మద్దమాల

రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు తప్పకుండా త్వరలోనే తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా పఠాన్ సమద్‌ఖాన్, కార్యదర్శిగా మద్దమాల రవి నియమితులయ్యారని, ఈ మేరకు గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఇద్దరి పేర్లు అధికారికంగా ప్రత్తిపాటి ప్రకటించారు. నూతన అధ్యక్షుడు సమద్‌ఖాన్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా అందరినీ కలుపుకు పోయి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

జయహో బీసీ విజయవంతం చేయడానికి కృషి చేయాలి


● నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1 : జయహో బీసీ కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్ ఆధ్వర్యంలో బీసీ నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అరవిందబాబు మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రతి బీసీ బిడ్డ వచ్చే విధంగా నాయకుల చొరవ తీసుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీతోనే బీసీల రాజకీయ భవితవ్యమని బీసీలకు రాజకీయ పదవులు కట్టబెట్టింది అన్న నందమూరి తారక రామారావు అని గుర్తు చేశారు. నరసరావుపేట గడ్డపై బీసీ బిడ్డ మీ అరవిందబాబు గెలుపునకు జయహో బీసీ నుంచి సమర శంఖారావం పూరించాలని అన్నారు. ఈ సమర శంఖారావంలో ప్రతి బీసీ బిడ్డ బాగస్వామి అయ్యేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, తిరుమలకొండ నరసింహారావు, పుచ్చకాయల బసవేశ్వరరావు, కొలిపాక చంద్రశేఖర్, మంజుల ఆంజనేయులు, దమ్మాటి మల్లికార్జున, కొలికొండ కొండలు, దాసరి నరసింహ రావు, మడకా ప్రసాద్, కొర్నెపాటి సంజీవరావు, సాంబశివరాజు, దుర్గా గణేష్, కొక్కెర గంగాధర్, తిరుమలకొండ గురవయ్య, తురకా ఆంజనేయులు, కుంచాల బాజీ తదితరులు పాల్గొన్నారు.

దాచుకున్న సొమ్ము కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి


● యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్


దీక్షలో కూర్చున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1: ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బుల కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వం కల్పించిందని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం నరసరావుపేట గాంధీపార్కు వద్ద ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రెండో రోజు దీక్షలు నిర్వహించారు. దీక్ష శిబిరాన్ని నరసరావుపేట ఎన్‌జీవో నాయకులు ఎం రామకృష్ణ, ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మా డబ్బులు మాకు ఇవ్వడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటో తెలియజేయాలన్నారు. బకాయిలు మొత్తం విడుదలయ్యే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. 12వ వేతన సవరణ సంఘం నియమించి 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య మాట్లాడుతూ దాచుకున్న డబ్బులు ఏమైపోతాయోనని ఉపాధ్యాయులు ఆందోళనపడి పోరాటం చేయాల్సిన స్థితి వచ్చిందన్నారు. దీక్షా శిబిరంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీ విజయకుమార్, జిల్లా సహాధ్యక్షులు ఎం మోహనరావు, జిల్లా కోశాధికారి జె.వాల్యానాయక్, జిల్లా కార్యదర్శులు రవికుమార్, ఏ శ్రీనివాసరావు, ఎస్‌కే ఆయేషా సుల్తానా, ఆర్ ఆజయ్‌కుమార్, కే వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, ఎస్‌కే జిలానీ, రాజ్‌కుమార్, ప్రసాద్, రామిరెడ్డి, గోవింద నాయక్, తిరుపతిరెడ్డి, రమేష్‌బాబు, మస్తాన్, భాను, గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జీ విజయసారథి నిమ్మరసం అందజేసి దీక్షలో కూర్చున్న వారిని విరమింపచేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో మున్సిపల్ ఉపాధ్యాయులు, పాఠశాలలు

● ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్


కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1: మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయులు తీవ్ర సంక్షోభంలో కొనసాగుతున్నారని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్‌ఉస్మాన్ మాట్లాడుతూ కిక్కిరిసిన విద్యార్థులు, వసతులు లేమి, ఉపాధ్యాయులపై అన్ని మున్సిపాలిటీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం మున్సిపల్ విద్యను, ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చినప్పటికి మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయులలకు సర్వీస్ రూల్స్ విడుదల చేసి బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయులు ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరయ్యేందుకు ఇతర ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మాదిరిగా వయోపరిమితి సడలింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లకు ఎంఈవో, డీవైఈవో పోస్టులు మంజూరు చేయాలన్నారు. అప్రెంటిస్ విధానం పునరుద్ధరణ నిర్ణయాన్ని తీవ్రంగా ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తున్నామని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా సభ కమిటీ సభ్యుడు కరీముల్లా, ఇబ్రహీం, బి.శ్రీనివాసరావు, కృష్ణారావు, దమ్మాటి శ్రీనివాసరావు, బిక్కి ప్రజామూర్తి, సాని శ్రీనివాసరావు, షరీఫా, హఫీజ్, విజయలక్ష్మి, గౌతమరాజు, బాబు, సాంబశివరావు, జాన్‌సాహెబ్, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరవనం ఏర్పాటుకు స్థల పరిశీలన

వినుకొండ, ఫిబ్రవరి 1: మండలంలోని వెంకుపాలెం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నగరవనం కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ రామచంద్రరావు గురువారం పరిశీలించారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న నగరవనం ఏప్రిల్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు హుస్సేన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన అవగాహన సదస్సు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 1: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో గురువారం ఎంఎస్‌ఎంఈ డెవలెప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఉన్న కేఎల్‌ఎస్ రెడ్డి పథకం గురించి అవగాహన కల్పించారు. ఈ యోజనతో చేతివృత్తుల వారు కేంద్రం, బ్యాంకుల ద్వారా ఆర్థికసాయం పొందవచ్చని అన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

యడ్లపాడు, ఫిబ్రవరి 1: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి విజయవాడ నుంచి నెల్లూరుకు బయలుదేరింది. అర్ధరాత్రి 1.05గంటలకు యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలోకి చేరుకున్న బస్సు తుని నుంచి మద్యం లోడుతో కడపకు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ షేక్ మస్తాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడగా బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. గాయపడిన ప్రయాణికులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● రేంజి ఐజీ పాలరాజు


సమీక్షలో మాట్లాడుతున్న రేంజి ఐజీ పాలరాజు

వినుకొండ, ఫిబ్రవరి 1: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు అన్నారు. పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలకు సంబంధించి వినుకొండలో గురువారం సమీక్ష నిర్వహించారు. ముందుగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించి శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలను సృష్టించే వ్యక్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారి కార్యకలాపాలను గమనిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్ రాఘవేంద్ర, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీలు కే మహేష్, పల్లపురాజు, బీ ఆదినారాయణ, ట్రైనీ డీఎస్పీ జగదీష్, ఎస్‌టీ సీఐ ప్రభాకర్, సీఐలు పాల్గొన్నారు.

ఐనవోలు పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఐజీ

నూజెండ్ల, ఫిబ్రవరి 1: సాధారణ తనిఖీల్లో భాగంగా ఐనవోలు పోలీసుస్టేషన్‌ను గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ పాల్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి రానున్న ఎన్నికల దృష్ట్యా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు.

పెట్రోలు బంకు సేవలను వినియోగించుకోవాలి

● కలెక్టర్ శివశంకర్


పెట్రోలుబంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 1: పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోలు బంకును ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో సుమారు 3కోట్ల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా నెలకు రూ.80,000 లీజు అమౌంట్ వస్తుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో మాచర్ల, శావల్యాపురం పెట్రోలు బంకులు ఏర్పాటు చేస్తారన్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదన పంపించి 32 ఎకరాలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో జేసీ శ్యాంప్రసాద్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిదులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 వేల ఖాళీలు అన్నారు

● నేడు 6 వేలకు నోటిఫికేషన్‌తో జగన్‌రెడ్డి దగా చేశారు

● తెలుగుయువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 వేల పోస్టులు ఖాళీ అని చెప్పి నేడు ఆరు వేలకు నోటిఫికేషన్ ఇచ్చి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి దగా చేశారని తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ యువతను జగన్‌రెడ్డి నిట్టనిలువునా ముంచేశారని, నయవంచనకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 65 రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 6100 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామనడం యువతను మోసగించడం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఏటా జాబ్ క్యాలెండర్‌లో డీఎస్సీ ఇస్తామని చెప్పి యువతను నిట్టనిలువునా ముంచేశారని అన్నారు. ఎన్నికల ముంగిట డీఎస్సీ అనేది ఒక కొత్త నాటకమని, ఈ ఐదేళ్లు ఆగి కేవలం 6100 పోస్టులకు మాత్రమే అనుమతి ఇవ్వడం వెనుక అర్థం ఏమిటన్నారు.

కొండకావూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


ఫెర్టిలైజర్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని కొండకావూరు గ్రామంలో వ్యవసాయశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఫెర్టిలైజర్స్ విక్రయిస్తున్న షాపుపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్పీ కె.కోటేశ్వరరావు పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కొండకావూరు గ్రామంలో శ్రీ రామకృష్ణ ఎంటర్ ప్రైజెస్ & ఫెర్టిలైజర్స్ దుకాణంలో రెండు కంపెనీలకు చెందిన సుమారు రూ.4,45,000 విలువ గల ఫెర్టిలైజర్స్‌ను అమ్మకాలు నిలిపివేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంటు వ్యవసాయాధికారి కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ ప్రసాదరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2023-24 పోటీల్లో ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. వీరిలో ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు. గొట్టం లక్ష్మీస్నేహలత, బొజ్జ యమునా, దనిరెడ్డిరాణి ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం ప్రసాదరావు, పీడీ జాజుల శంకర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

స్కూల్ గేమ్స్ బాలికల క్రికెట్ విజేత తూర్పు గోదావరి


విజేత జట్టుతో ఫెడరేషన్ నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 1: పట్టణంలోని క్రీడా ప్రాధికార స్టేడియంనందు గత నెల 29 నుంచి జరుగుతున్న 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాలికల క్రికెట్ పోటీల విజేతగా తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. గురువారం స్టేడియం నందు జరిగిన ఒక కార్యక్రమంలో విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. కాగా రెండో స్థానాన్ని అనంతపురం జట్టు, మూడో స్థానాన్ని కృష్ణా జిల్లా జట్టు, నాలుగో స్థానాన్ని కడప జిల్లా జట్టు కైవసం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.